# దూరపు కొండలు

ఆంధ్రభూమి వీక్లీ. 15 నవంబర్, 2001




"మీ కోసం ఎవరో అమ్మాయి వచ్చింది..!" హీరో విజయకృష్ణతో అన్నాడు రూమ్‌బాయ్.

"లోనికి పంపు!"

భయంభయంగా ఆ గదిలోకి అడుగుపెట్టింది మౌనిక.

హీరో విజయకృష్ణ లాల్చీ, పైజమాతో సోఫాలో కూర్చుని హుందాగా పేపరు చదువుతూ కన్పించాడు.

"నమస్తే సార్..! నా పేరు మౌనిక!"

"రామ్మా కూర్చో! ఏం తీసుకుంటావు... కాఫీ, కూల్‌డ్రింక్?"

"వద్దు సార్! థాంక్యూ..!"

"నేనిక్కడ ఉన్న విషయం రహస్యంగా ఉంచమని చెప్పానే..?!"

"రహస్యంగానే ఉంచాం సార్. నేను హోటల్ స్టాఫ్‌ని!"

"ఓఁ ఐసీ... చెప్పమ్మా! వాట్ కెన్ ఐ డు ఫర్ యు?"

ఒక్కక్షణం తటపటాయించి మళ్లీ చెప్పింది–

"సార్! నాకు చిన్నప్పటినుంచీ సినిమాల్లో నటించాలని ఆశ! సినిమా హీరోయిన్ కావడానికి తగ్గ అందం నాకుందనే అనుకుంటున్నాను. స్కూల్‌డేస్‌లో నాటకాల్లో కూడా నటించాను. మీరు నన్ను రెకమెండ్ చేస్తే నా జీవితాశయం నెరవేరుతుంది!"

"నువ్వు సినిమాల్లో చేరడానికి నీ తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందా?"

"లేదండీ! వాళ్ళకు నన్ను మా బావకిచ్చి పెళ్ళిచేసేయాలని ఉంది. కాని, నాకుమాత్రం సినిమాల్లో హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నాకే పెళ్ళిచేసుకోవాలని ఉంది."

"సినిమాల్లో చేరి ఏం చేస్తావమ్మా?"

"డబ్బూ, పేరు సంపాదిస్తాను."

"తర్వాత?"

"అలా ఎంతకాలం వీలైతే అంతకాలం నటిస్తాను."

"ఆ తర్వాత?"

జవాబు తెలియక అతనివైపే చూస్తూండిపోయింది.

"ఓ.కే... డబ్బు బాగానే సంపాదిస్తావనుకో– ఆ డబ్బునేం చేస్తావు? బ్యాంకులో దాచితే ఇన్‌కంటాక్స్ ప్రాబ్లెమ్! ఇంట్లో దాచితే దొంగల బాధ! నమ్మకస్తుల దగ్గర దాచి, వాళ్ళు నమ్మకద్రోహం చేస్తే అది మరీ బాధ! నీ సినిమాలు ఫ్లాపైతే ఒక బాధ! ఇతర హీరోయిన్ల సినిమాలు హిట్టయితే అది ఇంకా బాధ! నీకు ఆఫర్లు లేకుండా మిగతా హీరోయిన్లు బిజీగా ఉంటే అసూయ! ఒకసారి పేరుకీ, డబ్బుకీ అలవాటు పడి, అవి లేని రోజున టెన్షన్, డిప్రషన్! దానిని తట్టుకోవడం కోసం త్రాగుడుకి బానిసవడం..."

అతను చెప్పేది శ్రద్ధగా వింటోంది మౌనిక.

"ఇవేకాక, హీరోతో చనువుగా ఉండకపోతే ఒక ప్రాబ్లెమ్! చనువుగా ఉంటే ఇంకో ప్రాబ్లెమ్! డబ్బు ఇవ్వకుండా సతాయించే నిర్మాతలు, ఒక పట్టాన షాట్ ఓ.కె. చెయ్యకుండా కసి తీర్చుకునే దర్శకులు, నీవు ఒకటి చెప్తే మరొకటి రాసే పత్రికలు! పైగా... ఈ ఫీల్డులో ఎవరు ఆప్తులో, ఎవరు శత్రువులో ఇంత అనుభవమున్న నేనే తెలుసుకోలేకుండా ఉన్నాను. మరి, ఇంత చిన్నదానివి, పైగా ఆడదానివి– ఎలా నెగ్గుకు రాగలవమ్మా?"

"ప్రతి హీరోయిన్ ఇలాగే ఆలోచించి ఉంటే– ఒక సావిత్రి. ఒక జయసుధ, ఒక శ్రీదేవి మనకు దొరికేవారా సార్!"

"నిజమేనమ్మా! కానీ, అలా ఎంతమంది పేర్లు చెప్పగలవు? ఎంతమంది హీరోయిన్లు త్రాగుడుతో, ఆత్మహత్యలతో తమ జీవితాల్ని అంతం చేసుకోలేదు? ఎంతమంది ఇళ్ళు వదలివచ్చి అటు అవకాశాలూ లేక, ఇటు ఇంటికి తిరిగి వెళ్లనూలేక... ఒళ్ళు అమ్ముకొని బ్రతకటం లేదు..?!"

కొంతసేపు ఆగి అడిగాడు-

"మీ బావతో పెళ్ళి నీకు ఇష్టంలేదా?"

"ఇష్టమే! కానీ, మా బావ ఒక మామూలు బ్యాంకు ఉద్యోగి. నేనంటే అతనికీ ఇష్టమే. కాని, నా జీవితాశయం నెరవేరాకే నా పెళ్ళి!" స్థిరంగా అంది.

"దూరపుకొండల్ని చూసి పరుగెత్తడమంటే ఇదేనమ్మా! నీవు లక్షణంగా మీ బావని పెళ్ళి చేసుకో! నీవు కోరుకున్నదాని వెంటపడటం కంటే- నిన్ను కోరుకున్నవాడితో నీవు సుఖపడతావు."

"క్షమించండి సార్! మీరింత చెప్పినా నాకింకా నా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే వుంది. నా ఫ్రెండ్ సత్యప్రభ ఈమధ్యనే హైదరాబాద్ వెళ్లి రెండు సినిమాల్లో ఛాన్సు తెచ్చుకుంది. నన్ను కూడా రమ్మని ఉత్తరం రాసింది. నాకు తప్పకుండా హీరోయిన్ ఛాన్స్ ఇప్పిస్తానంది."

"ఆ అమ్మాయి అడ్రసు నీ దగ్గర ఉందా?" అడిగాడు.

ఉందని తలాడించి, తన హేండ్‌బ్యాగ్ నుంచి ఒక ఫోటో, అడ్రస్సున్న కాగితం విజయకృష్ణ కిచ్చింది మౌనిక.

వెంటనే అతడు తన సెల్‌ఫోన్ అందుకుని ఒక నెంబరు డయల్ చేసి-

"సురేష్! మన యూనిట్‌కి జూనియర్ ఆర్టిస్టులను సప్లై చేసే అతడ్ని నా గదికి పంపు!" అన్నాడు.

తర్వాత మౌనికను చూస్తూ అన్నాడు-

"సినిమాఫీల్డులో అందరూ చెడ్డవారని నేను చెప్పను. అన్నిచోట్లా ఉన్నట్లే మంచి, చెడు ఇక్కడా ఉంది. కానీ, ఇక్కడ విజయం సాధించాలంటే చాలా కష్టపడాలి. అదృష్టం కలిసి రావాలి. ముఖ్యంగా... అయినవాళ్ళ ప్రోత్సాహం ఉంటేనే ఇవన్నీ సాధ్యం! నీ తల్లిదండ్రులకు నీవు సినిమాల్లోకి రావడం ఇష్టం లేదంటున్నావు కాబట్టి- నీకు ఇంకా కష్టం!"

ఇంతలో... ఓ వ్యక్తి వచ్చి, "నమస్కారం సార్! నాపేరు రవి. మీరు రమ్మన్నారట?!" అన్నాడు.

విజయకృష్ణ అతనికి ఫోటో అందిస్తూ- "ఈ అమ్మాయి పేరు సత్యప్రభ! ఈమె గురించి నీకు తెలుసా?" అని అడిగాడు.

అతడు ఫోటో చూసి-

"తెలుసు సార్! సినిమాల్లో హీరోయిన్ కావాలని ఎంతో ఆశపడింది. చాలామంది నిర్మాతలు ఛాన్స్ ఇస్తామని మోసం చేశారు. ఇప్పుడు గ్రూప్‌సాంగ్స్‌లో, అప్పుడప్పుడూ ఎక్స్‌ట్రా వేషాలు వేసుకుంటూ గడుపుతోంది!"

మౌనిక వైపు చూశాడు విజయకృష్ణ.

షాక్ తిన్నట్లు చూస్తోందామె.

"నీవు ఇంటికెళ్లి బాగా ఆలోచించు. తర్వాత కూడా నీవు సినిమాల్లో చేరాలనే కోరుకుంటే రేపు ఉదయం ఇక్కడికి రా!"

'అలాగే...'నన్నట్టు తలాడించి, సెలవు తీసుకుంది మౌనిక.

ఆమె వెళ్లిన తర్వాత రవి వైపు తిరిగి అన్నాడు విజయకృష్ణ-

"రవీ! నీకు సత్యప్రభ నిజంగా తెలుసా?"

"తెలీదు సార్! నేనింతవరకూ చూళ్లేదు. కాని, నేను చెప్పినదానికంటే మెరుగ్గా ఏం ఉండదు ఆమె పరిస్థితి! మీరు ఈ అమ్మాయి మనసు మార్చి ఆమె జీవితాన్ని కాపాడాలను కుంటున్నారని నాకర్థమైంది. అందుకే అలా చెప్పాను!"

"వెరీగుడ్..! ఇంట్లో చెప్పకుండా మద్రాసో, హైదరాబాదో పారిపోయే అమ్మాయిలందర్నీ కాపాడలేకపోయినా– కనీసం మన దగ్గరకొచ్చిన అమ్మాయిలనైనా మంచిమార్గంలో పెడితే చాలు!" అన్నాడు విజయకృష్ణ.

• • •

మరుసటిరోజు ఉదయం ఫోనొచ్చింది అతనికి.

"నమస్తే సార్... నేను మౌనికను! రాత్రంతా మీరు చెప్పింది ఆలోచించాను. మీరు అన్న ప్రతిమాటా నాకర్థమైంది. నేను మిమ్మల్ని నిన్న కలవకపోయివుంటే ఏదో ఒకనాడు ఇంట్లో చెప్పకుండా హైదరాబాదు పారిపోయేదాన్ని. స్టూడియోల చుట్టూ తిరుగుతూ ఉండిపోయేదాన్ని. నేను మీకెంతో ఋణపడి ఉన్నాను సార్. ఇక నా అందమైన జీవితాన్ని వృధా చేయను!"

"మంచిదమ్మా..! నీకు అంతా మంచే జరుగుతుంది. నీ పెళ్ళిపత్రిక పంపడం మరవొద్దు!"

ఫోన్ పెట్టేశాక తృప్తిగా నిట్టూర్చాడు హీరో విజయకృష్ణ.